# పగిలిన అద్దంలో రెండు ముఖాలు

* కావిలిపాటి విజయలక్ష్మి

పొన్నచెట్టువైపు చూస్తూ కూర్చుంది అరుంధతి. ఆమె శ్రీ కూర్మం రావటం ఇదే తొలిసారి. ఆలయ శిల్పాలు చూసి ముగ్ధురాలయింది. ఆమెకు అమ్మమ్మ చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి 'దేవాలయానికి మొదటిసారి చేసే ప్రదిక్షణం శిల్పులకి, రెండవ ప్రదిక్షణం ధర్మకర్తలకి, మూడవ ప్రదిక్షణం దేవుడికి' అని.

సాధారణంగా ప్రతిమనిషి ఆదరా బాదరా హడావుడిగా ఒక్క ప్రదిక్షణమే చేస్తారు కనుక, శిల్పులే అందుకుంటారు ప్రదిక్షణ నమస్కారం. 'న్యాయం అంతే' అనుకున్న అరుంధతి పెదవులపై హాసరేక విరిసింది.

పిల్లలు అల్లరిగా పొన్నచెట్టు ఆకులూ కాయలూ తెంపుతున్నారు. ఒక అమ్మాయి పిర్యాదుచేసింది. 'చూడండి మేడమ్! రాధి చెట్టు ఎక్కుతూంది' అని.

"ఏయ్, రాధి!" చీర కుచ్చెళ్ళు సవరించుకుంటూ పిల్చింది అరుంధతి.

రాధి చప్పున చెట్టుమీంచి దిగింది.

అరుంధతి ఒక గరల్సు హైస్కూలు హెడ్‌మిస్ట్రెస్. విహారయాత్ర కని, పిల్లల్ని తీసుకొని ప్రయాణమైంది. ఉదయం అరసవెల్లి సత్రంలో బసచేసి కాఫీ టిఫిన్లూ అయ్యాక, 'కూర్మం' వచ్చారు. ఆమెతో మరొక ఐదారుగురు టీచర్లు, రైటరూ, ప్యూను, పనిమనిషి వచ్చారు. మూడేళ్ళ కొడుకుని కూడా వెంటపెట్టుకు వచ్చింది అరుంధతి. ఆ పిల్లాణ్ని అమ్మాయిలే ఎత్తుకు తిప్పుతున్నారు.


శ్రీకాకుళం, అరసవెల్లి, కూర్మం, ముఖలింగం చూసి మళ్ళీ వెంటనే వెళ్ళిపోయే ప్రోగ్రాం అది. 'ఇహ పోదామా!' అని అరుంధతి అడగటం: ఇంకాసే పుందాం మేడమ్ అని పిల్లలు బ్రతిమలాడే ధోరణిలో అనటం అప్పటికి రెండు సార్లయింది. చెట్లు ఎక్కేవారు కొందరు వంశధార నదివైపు వెళ్ళేవారు కొందరూ. ఆలయ శిల్పాలు శ్రద్ధగా పరికించేవారు కొందరు, అక్కడ స్థలపురాణంచెప్పే బ్రాహ్మణ్ని ఏవో కొంటెప్రశ్నలుచేసి ఆట పట్టించేవారు కొందరు.

వారివైపుచూసి నవ్వుకుంటూంది అరుంధతి! 'యిదే జీవితంలో విలువైన కాలం. తాను బాల్య జీవితం ఎంత

హో యిగాగడిపింది!' అనుకున్న అరుంధతి కనుల్లోకాస్సేపు నీలి నీడలు తారట్లాడాయి.

మళ్ళీకూర్చుంది అరుంధతి. తెలుగు టీచరు గంగాభవాని గలగలాఏదో మాట్లాడుతూంది. దస్కుముందు కూర్చున్న






గుమస్తా. 'అమ్మా. మీరు ఎన్నిటిక్కెట్లు కొన్నారు?' అని అడిగాడు తెలుగు టీచర్ని. అతను అడగటం. ఆమె చెప్పటం. అప్పటికి ఐదవసారి.

"అరవైముగ్గురం. ఆ పుస్తకంలో వ్రాసేసుకోండి జ్ఞాపకముంటుంది" అందామె విసుగ్గా.

ఇంతలో ఒక వ్యక్తివచ్చి టిక్కెట్టు అడిగాడు గుమాస్తాని.

అప్రయత్నంగా అటువైపు చూసిన అరుంధతి చూపులలా నిల్చిపోయాయి. "కేశవ్! ఎంత కాలానికి చూసింది అతన్ని?"

యధాలాపంగా తలెత్తి చూపిన కేశవ్....'మీరు .... నువ్వు' అన్నాడు తడబాటుగా. అదేక్షణంలో, 'మీరు.... నువ్వు' అంది అరుంధతి.

తర్వాత ఇద్దరూ ఒకేసారి నవ్వారు.

"నేను అరుంధతిని" అంది అరుంధతి.

"గుర్తు పట్టానులే .... ఏమిటిలా వచ్చావ్? నువ్వెక్కడ?" అడిగాడు కేశవ్.

గడగడా దేవుని దర్శనం చేసుకు

వచ్చిన కేశవ్‌కి తనకో టీచర్స్‌తో, కలసి సింహద్వారం దాటి వెళ్ళిపోతూన్న అరుంధతి కనిపించింది.

ఆలయం ముందు చిన్న మంటపంలో చతికిలబడ్డాడు కేశవ్. అరుంధతికి ఇంకా నామీద కోపం పోలేదయి ఉంటుంది. నేను తిరిగి వచ్చేలోపల వెళ్ళిపోయింది. పోన్లే. అడ్రసు చెప్పిందిగా. వెళ్తాను' అనుకొని మళ్ళీ లోపలికి వెళ్ళి దేవాలయంమీద చెక్కిన శిల్పాలు చూశాడు. మరొకసారి గర్భగుడిలోని దేవుణ్ణి చూశాడు. మళ్ళీ వచ్చి ఇవతల కూర్చున్నాడు. అతని దృష్టి పొన్నచెట్టుమీద పడింది.

"అదేం చెట్టు?" అడిగాడు అక్కడ కూర్చున్న గుమాస్తాని.

"పొన్నచెట్టు" చెప్పాడతను.

పొన్నచెట్టు అని వినేసరికి అతని ముఖమెందుకో ఉదాసీనంగా మారింది. 'పొన్నచెట్టులో పొద్దుదూరింది' అని తను పాడితే 'ఛీ, పో! చెట్టులో పొద్దుదూరటమేమిటి? అదేం పాట' అని గలగలా సెలయేటి రొదలా నవ్వేది అరుంధతి. ఆ నవ్వుకోసం తనా పాట పాడేవాడు. ఈ చెట్టు ఆమెకు గతాన్ని గుర్తుచేసి ఉంటుంది. అరుంధతి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిపోయిందని విన్నాడు. అమ్మ తనను పెళ్ళి చేసుకోమని బ్రతిమిలాడింది. తిట్టింది. ఏడ్చింది కాని తను అంగీకరించలేకపోయాడు. అరుంధతి తన మమతని మనస్సుని గాయపరిచింది. ఆమె లేని జీవితం తనకు అక్కరలేదనిపించింది. ఆమెతోడిదే జీవితమని నమ్మి కమ్మని కలలు కన్నాడు తను. తన అభిప్రాయాలు ఆమె ఇంత సీరియస్‌గా తీసుకుంటుందని, తననొక హృదయంలేని మనిషి క్రింద జమకడుతుందని, వివేకశూన్యుడి క్రింద అంచనా కడుతుందని, ఇంకా తనమనస్సుతో చెలగాటమాడిందనీ ఊహించలేకపోయాడు.

ఓనాటి తమ సంభాషణ దృక్పథంలో మెదిలింది కేశవ్‌కి.

విశాఖలో, బీచ్ ఒడ్డున సిమెంటు బెంచీమీద కూర్చుని గలగలా ఏవో కబుర్లు చెప్పే అరుంధతి "అతనెవరు?" అనే తన ప్రశ్నకు కంగారుపడినట్లయి, "ఎవరు?" అని ఎదురుప్రశ్న వేసింది.

"అతను....నువ్వు హాస్యం చేస్తున్నావు. అతను నీ జబ్బ పట్టి లాగుతున్నాడు. మీ పెరటిలో జామిచెట్టుక్రింద గుర్తురావటంలేదూ? నిన్న సాయంత్రం" అన్నాడు కేశవ్.

"ఓ" అని నవ్వి, "అతనా?మా బావ" అంది తేలిగ్గా అరుంధతి.

కేశవ్ ముఖం ఉదాసీనంగా, గంభీరంగా మారిపోయింది.


"ఏం? ముఖం అలా పెట్టావు జెలసీనే!" కవ్వించింది అరుంధతి.

"జెలసీ అనుకో. మరేమన్నా అనుకో. ఆ సంఘటన చూసిన నా గుండెల్లో మంట లేచింది. అరూ, ఎంత బావైనా నువ్వలా ప్రవర్తించటం బాగోలేదు."

అతనిముఖంలోకి పరిశీలనగా చూసింది అరుంధతి. అతనిలోని అస్సలు మనిషిని చదపటానికి ప్రయత్నిస్తూ.

అతనామెను గమనించలేదు. "నాకు ఎవరన్నా సరే, అలా పరాయి మగ

జ్యోతి కథకార్టూన్ — పగిలిన అద్దం....




వాడితో చనువుగా మాట్లాడటం గిట్టదు. ఇంకా షోకులు చేసుకొని బజార్లంట తిరగటం, సోషల్ పేరుతో మగవాళ్ళ బుజాలు కలిపి తిరగడం, ఇవన్నీ నాకు ఇష్టం కాదు. నువ్వు వీధి గుమ్మం దాటాలంటే ముస్తాబవుతావు. అందమైనదానివేమో! అందరి కళ్ళూ నీమీదే ఉంటాయి. అప్పుడు నే నెంత బాధపడతానో చెప్పటానికి నాకు మాటలు చాలవు" అన్నాడు కేశవ్.

"అయితే నీతో కష్టమేనే!" అంది అరుంధతి. అతని ముఖంలోకి సూటిగా చూస్తూ.

నవ్వి! "నా అభిప్రాయాలు దాచకుండా చెప్పాను. అంతే. నన్ను పెళ్ళిచేసుకుంటే నేను ఒక రాక్షసుడిలా ప్రవర్తిస్తానని అనుకోకు" అన్నాడు అరుంధతివైపు చూసి, చూపులు వాల్చేస్తూ.

"ఒకవేళ నీ ఇష్టానికి అనుగుణంగా ప్రవర్తించలేకపోతే?"

"ప్రవర్తించ గలిగేటట్లు ప్రయత్నిస్తాను."

అరుంధతి మాట్లాడలేదు. తల వంచి నేలచూపులు చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

"కొట్టి తిట్టి హింసిస్తానని అనుకోకు. సరే. మీ బావవాళ్ళు వెళ్ళిపోయారా?" అడిగాడు కేశవ్.

"నిన్న రాత్రి ట్రెయినులో వెళ్ళిపోయాడు. ఇంతకీ అతనికి పెళ్ళయింది. ఇద్దరు పిల్లల తండ్రి." అంది అరుంధతి నవ్వబోతూ.

"అతనికి బుద్ధిలేదు. వయసువచ్చిన పిల్లను అలా తాకవచ్చా."

"మామయ్య కూతుర్ని గదా!"

"ఐతేమాత్రం? హద్దుండాలి దేనికయినా."

"వెళ్దామా" లేచి నిల్చుంది అరుంధతి.

తానూ లేచి నిల్చున్నాడు.

తమ ఇంటివైపు రోడ్డు చివర ఇద్దరూ విడిపోయారు. ఎవరి ఆలోచనలతో వారు నడిచారు కాని తోవలో ఏమీ మాట్లాడుకోలేదు.

అరుంధతి కేశవ్ ఇరుగు పొరుగు ఇళ్ళ వారు. చూపులతో ప్రారంభమైన ఆ వారి ప్రేమ మాటలవరకూ వచ్చింది. పెళ్ళి అంటూ చేసుకుంటే అరుంధతినే చేసుకుంటాను లేకపోతే జీవితాంతం ఇలానే వుండిపోతాను అనే నిశ్చయానికి వచ్చాడు కేశవ్. అంతేకాదు. ఆ అభిప్రాయం తల్లి దగ్గర వ్యక్తంచేసి చీవాట్లు తిన్నాడుకూడా.

అరుంధతీ అదే నిశ్చయానికి వచ్చింది. కాని ఎవ్వరికీ తన అభిప్రాయం చెప్పలేదు. తల్లితండ్రులు తనకు ఏవో సంబంధాలు ఉన్నాయనుకోవటం వింటూంది. చూపులు వగైరా జరిగితే. తనకు నచ్చలేదని వాయిదా వెయ్యొచ్చని అనుకుంటుంది. ఉదయంలేస్తూనే తను కేశవ్ని చూడాలి. తను లేచి జామచెట్టు క్రింద పళ్ళు తోముకుంటూ కూర్చుంటుంది. అతను డాబామీద పచార్లు చేస్తూంటాడు. రోజు మొత్తంలో ఒకర్ని ఒకరు చూడందే నిలవలేని పరిస్థితికి వచ్చారిద్దరూ.

"వీడేమిటి ఇలా అంటున్నాడు. పరువు ప్రతిష్టలేంగాను." అని తల కొట్టుకు ఏడుస్తూంది కేశవ్ తల్లి. ఆమెకు అతను ఒక్కడే కొడుకు. పెద్దచదువు చదివాడు. బోలెడు ఆస్తులున్నాయి. మంచి సాంప్రదాయమైన కుటుంబంలోని అందమైన పిల్లను కోడలిగా తెచ్చుకోవాలని ఉందామెకు. అరుంధతిని చూస్తూంటే ఆమెకు పళ్ళు మండుతూంది. తన కొడుకుని వలలో వేసుకుందని బాధపడిపోతూంది. పిల్లచిన్నదైనా 'జాణ' తల్లితండ్రులైనా కూతుర్ని అదుపులో పెట్టుకోరు అని పళ్ళు కొరుకుతూంది.

మర్నాటి ఉదయం జామచెట్టు క్రింద కనుపించలేదు కేశవ్కి అరుంధతి. కారణం ఊహించలేక కలవరపడ్డాడు.

రెండుమూడు రోజులు గడిచాయి. అరుంధతికోసం, ఆమె చూపుల్లో చూపులు కలపడంకోసం ఆరాటపడుతూన్న కేశవ్కి నిరాశే ఎదురయ్యింది.

అరుంధతి అప్పుడప్పుడు అటూ ఇటూ తిరుగుతూ కనుపిస్తూంది. కాని తనవైపు చూడటంలేదు. తనవైపు చూడకుండా ఎలా వుండగలుగుతుంది? అతనికేమీ తోచటంలేదు. 'నువ్వు ఆ అమ్మాయిని ఏమైనా అనివుంటావు' అని తల్లి మీద కోపగించుకున్నాడు.

"నాకేం తెలుసురా ప్రారబ్ధం. ఆ పిల్లతో నేనెప్పుడు మాట్లాడాను?" అందావిడ.

తర్వాత మూడవరోజు అరుంధతి అన్నకొడుకు నాలుగేళ్ళ శ్రీను చిన్న కాయితం మడత కేశవ్ చేతిలోపెట్టి అతనిచ్చిన చాకెలెట్ తీసుకొని తుర్రున పారిపోయాడు. అసలు చిన్నపిల్లలంటె ముద్దు కేశవ్కి. బొద్దుగా తెల్లగావుండే శ్రీనంటే ఇంకా ఇష్టం. ప్రతి సాయంత్రం. 'మామయ్యగారూ' అంటూ వస్తాడు కేశవ్ ఇంటికి శ్రీను.

"మామయ్యగారూ" ఆ పిలుపులో ఏవో అర్థాలువెతికి పరవశమౌతాడు కేశవ్. కాస్సేపు కబుర్లుచెప్పి చాకెలెట్

తీసుకొని వెళ్ళిపోతాడు శ్రీను. అది ఐదారు నెలలుగా ఐన అలవాటు. అరుంధతిని ఆరాధించటం ప్రారంభించాకే శ్రీనుని మచ్చికచేసుకోవటం మొదలు పెట్టాడు కేశవ్. అంతకుముందు బుగ్గలు గిల్లి ఎత్తుకు ముద్దాడి వదిలేసేవాడు కాని అతను తనదగ్గరకు ప్రతిరోజు రావాలని చాకెలెట్లు ఇస్తున్నాడు ఇప్పుడు.

మీ అత్త ఏంచేస్తూంది? అడుగుతాడు కేశవ్. ఏదో చెబుతాడు శ్రీను. ఇంకా అత్తగురించి ప్రశ్నలువేసే కేశవ్‌కి ముద్దు ముద్దుగా జవాబులిస్తాడు శ్రీను.

ఇవ్వాళ కాయితమేమిటో? 'అత్త ఇమ్మంది' అని చేతిలో పెట్టాడు. ఇంత వరకూ తమ మధ్య ఉత్తరాలు నడవ లేదు, ఇద్దరికీ భయమే, ఐనా అవసరం లేదనిపించింది. ఏమిటవిరాసింది అరుం ధతి? అతని గుండెలు పీచు పీచు మంటు న్నాయి. కాయితం తీసుకొని గదిలోకి వెళ్ళి, తలుపులు మూసుకున్నాడు.

కాయితం మడత విప్పుతూంటె అతని చేతులు వణికాయి. పంక్తుల వెంట నడిచాయి చూపులు.

"కేశవ్, ఇవ్వాళనుంచీ మనం ఉత్త స్నేహితులం. లేదా ఇరుగుపొరుగువారం. అంతే, ఇదివరకు మనకు ఉండే అభి ప్రాయానికి స్వస్తిచెప్పు. నేను యెంతో ఆలోచించి నిన్న అర్ధరాత్రివేళకు ఈ నిర్ణ యానికి వచ్చాను. నేను కనిపిస్తాననీ, నన్ను చూడాలనీ, డాబామీద పచార్లు చెయ్యకు. మా అమ్మ అంటూంది ప్రతి రోజు—'ఆ అబ్బాయికి ఏం బుద్ధి లేదు! చదువుకున్నవాడు మళ్ళీ. పెరట్లో మెసిలే ఆడవాళ్ళవైపు అలా చూస్తాడేమిటి?' అని. కారణం ఏమిటి అని నన్ను ప్రశ్నించకు. ఐనా నీకు ఆ అవకాశం ఇవ్వటం లేదులే. ఈ ఉత్తరం నీ చేతికి అందేవేళకు నే నీ ఊర్లో ఉండను. మా పిన్నిగారింటికి వెళ్తున్నాను. మరి సెలవ్. గతం పీడకలగా విస్మరించు—

అరుంధతి."

రెండుసార్లు, మళ్ళీ మళ్ళీ, ఎన్నిసార్లు చదివాడో ఉత్తరం! 'అరుంధతి ఎందు కిలా అభిప్రాయం మార్చుకుంది? తా నేం అపరాధం చేశాడని?' ఎంత తల కొట్టు కున్నా కారణం ఊహకు అందలేదు' చాలాసేపు తర్వాత తట్టింది. 'తన అభి ప్రాయా లామెకు నచ్చలేద'ని.


తాను కట్టుకున్న బంగారు ఊహా సౌధాలు ఇసుకలో కట్టిన పిచ్చికగూళ్ళలా కూలిపోయాయి. 'తను అంత తొంద రగా బయటపడి ఉండాల్సింది కాదు. ఆమె తన స్వంతమైన తర్వాత, తన ఇష్టాయిష్టాలు ఆమెకు తెలిపి ఉండాల్సింది' అని నొచ్చుకున్నాడు.

ఇన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత అనుకోకుండా కనిపించింది ఇవ్వాళ అరుం ధతి. తనతో మాట్లాడటం ఇష్టంలేదో ఏమో, తనకు మాట్లాడే అవకాశమివ్వ కుండా వెళ్ళిపోయింది. దీర్ఘంగా నిట్టూర్చి లేచి నిల్చున్నాడు కేశవ్.

వాచ్ చూసుకొని బస్ టైమయ్యింది' అనుకొని గబగబా అడుగులు వేశాడు. ముష్టివాళ్ళు కాళ్ళకు అడ్డం పడితే తప్పించుకుంటూ.

* * *

తాను కేశవ్‌నిచూసి పది సంవత్సరాలు దాటింది. కాని అప్పటికీ ఇప్పటికీ ఓలానే




వున్నాడు కేశవ్. ఆ చూపు ఆ నవ్వు తనను ఓనాడు పిచ్చిదాన్ని చేసిన ఆ రూపంలో ఏమి మార్పు రాలేదు. 'వస్తానుండు' అని వెళ్ళాడు. వచ్చి ఏమి చెప్పాలని?' అతన్ని ఎంత పిచ్చిగా ఆరాధించింది? అతనితో జీవితం ముడిపెట్టుకోవాలి ఎన్ని కమ్మని కలలు కన్నది? అతనూ తనలానే తనను ఆరాధిస్తున్నాడనుకుంది కాని, ఉత్త అనుమాన పిశాచమని ఊహించిందా?

గతం సుడులు తిరిగిందామె దృక్పథంలో.

అవ్వాళ 'విశాఖ' బీచ్‌లో ఏదో చెప్పకూడనిది నోరు జారినట్లు ఫీలయ్యాడు కేశవ్. అతను తన మనసును విప్పి అలా చెప్పకపోతే, అతనెలాంటి మనిషో తనకీ నాటికీ అర్థమయ్యేదికాదు. అతని చూపుల్లో ఆ ఆకర్షణలో ఉన్న మత్తులో కొట్టుకుపోయేది. అతనేమిటో తెలియకుండానే అతని సొత్తయిపోయేది. ఓహ్. భగవాన్. ఎంత దయామయుడివి నువ్వు! ఆ అనుమాన పిశాచం తన భర్త అయి జీవితం నరకం కాకముందే అతనేమిటో తెలియజేశావు. అని భగవంతుడికి కృతజ్ఞతతో నమస్కరించింది. గబగబా ఇంటికి వచ్చింది

ఆ రాత్రి తనకు అన్నం సయించలేదు. సరిగా నిద్రపట్టలేదు. ఉదయం లేస్తూనే, ఎదరింటి గోపాలం మేష్టారి కేకలు వినిపిస్తున్నాయ్.

"ఎన్నిసార్లు చెప్పాను. వేషం. అసలు నువ్వు సినిమాకు వెళ్ళింది ఎందుకే, వాణ్ణి చూడ్డానికి కదూ" ఇహ వినలేక పోయింది. ప్రతి రోజూ వినే మాటలే అవి. అతనికి భార్యమీద అనుమానం. మంచి చీర కట్టనివ్వడు. పువ్వులు

ముడవనివ్వడు. వీధి గడప దాటనివ్వడు. ఆమె తన స్వంత అన్నదమ్ముడితో మాట్లాడినా ఏం మాట్లాడిందో ఎవరికి రాయబారం పంపిందో! అని ఊహించి ఆమెను హింసిస్తాడాయన.

కేశవ్ తన భర్త ఐతే! కేశవ్ రూపం గోపాలం మాష్టారులా కనిపించింది. వద్దు వద్దు తనలాటి ఊబిలో కూరుకుపోయి గిలగిల తన్నుకోకూడదు. తప్పించుకోవాలి. కేశవ్‌ని మరి చూడకూడదు. ఆ ఆకర్షణనుంచి తప్పించుకోవాలి, లేదు, కేశవ్‌కి దూరంగా ఎక్కడికన్నా వెళ్ళిపోవాలి. మరి, కాదు. వద్దు, అనకుండా పెద్దలు కుదిర్చిన సంబంధం వప్పేసుకోవాలి.

ఈ నిర్ణయాన్ని దృఢం చేసుకోటానికి రెండురోజులు పట్టింది. కేశవ్‌కి ఉత్తరం వ్రాసి పంపించాలనే నిర్ణయానికి వచ్చింది.

ఉత్తరం ఎన్నిసార్లు వ్రాసిచించిందని? 'అలా కాదు, అలా కాదు' అంటూ. చివరన ఒక ఉత్తరం బాగుందని శ్రీనుగాడిచేత పంపించింది. తర్వాత ఆ ఉత్తరం సారాంశం అతనికి అర్ధమవుతుందో కాదో ఇంకా విపులంగా వ్రాయవలసింది అనిపించింది. కాని నువ్వు అనుమానవు మనిషివి అని వ్రాసేస్తే మళ్ళీ కాదు. నేను మంచివాడినని నమ్మించబోవటం, క్షమాపణలూ, వేడికోలు. ఎందుకు ఇలా వ్రాయటమే మంచిది. మళ్ళీ అతని మాటల్తో మెత్తబడి. మళ్ళీ ఈ నిర్ణయం మార్చుకుంటే గోపాలం మాష్టారి భార్య జీవితానికి, తన జీవితానికీ, పెద్ద వ్యత్యాసమేమీ ఉండదు. అప్పుడు తనవారంతా తననే నిందిస్తారు. మేము చెబితే విన్నావుకావు అనుభవించు అంటారు. పిన్నిగారింటికి వెళ్ళిపోయింది కేశవ్‌ని తప్పించుకోవటానికి. అమ్మ పిన్నికి సంబంధాలు చూడమని వ్రాసింది.

నరసింహంగారు తనకు నచ్చి పెళ్ళికి వప్పుకుందా? నల్లని ముఖం తెల్లని పలువరుస. ఒకసారి చూస్తే, మళ్ళీ అతన్ని చూడాలనిపించని రూపం. ఐతే అతను చాలా మంచిమనిషి. అని అందరూ అన్న మాట. పైగా అతను ఇంజనీరు. కట్నం ఇంత కావాలని అడగలేదు. బాబయ్య 'కట్నం యెంత?' అని అడిగితే పొడిగా నవ్వేసి 'మీ శక్తి. మీకు తోచినది ఇవ్వండి మీ అమ్మాయికి. ముందు ఆ అమ్మాయికి నేను ఇష్టం అవునో కాదో కనుక్కోండి' అన్నాడట. దానితో అతని మంచితనం మరో అంగుళానికి పెరిగింది.

ఆ నెలలోనే తన పెళ్ళయింది. సెలవు లేదంటే అటునుంచి అటే మద్రాసు వెళ్ళిపోయింది. అతని వ్యక్తిత్వం, ఉద్యోగం జీతం తనను ఆకర్షించాయి కాని అతని రూపం తనను ఆకర్షించలేదు.

నచ్చని అతని రూపాన్ని గురించి ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోతే "ఏం? అరూ! డల్‌గా ఉన్నావు. ఎటన్నా వెళ్దామా!" అడిగేవాడు. ఆ గొంతులో ఎంత ఆప్యాయత! ఎంత అనురాగం!

అతను నెల మొత్తంలో యింట్లో ఉండేది కొద్ది రోజులే. ఆ కొంచం రోజులూ అతన్ని తను మనస్ఫూర్తిగా సంతోషపెట్టలేకపోయేది. 'మంచి మన

నోడి

స్పున్న ఇతనికి దేవుడు మంచి రూపం ఎందుకివ్వలేదో! ఇతనికి కేశవ్ రూపం వస్తే ఎంత బాగుండేది' అనుకునేది.

చీరలూ, నగలూ, సినిమా, షికార్లూ, తను ఏం కోరినా అతను కాదనలేదు. తనకు జ్వరం వస్తే, జలుబుచేస్తే! ఎంత కంగారు పడిపోయేవాడని!

ఆప్యాయంగా అతన్ని తన చేతులు చుట్టుకోలేదెప్పుడూ. "పెళ్ళం... ఇంత కాలమైనా నీకు సిగ్గు పోలేదు" అని నవ్వు కుంటూ తన చేతుల్ని అతనిమీద అతనే పడేసుకునేవాడు వాడిన తోటకూరకాడలా తన చేతులు వ్రేలాడేవే కాని అతన్ని అత్తుకునేవి కావు. తన మనసు మంద లించినా, అవి వినేవి కావు.

తను తల్లి కాబోతూందని తెలుసు కున్న రోజు, అతని ముఖం వెయ్యి రేకుల పద్మంలా వికసించింది.

తనను ఎంత అపురూపంగా చూసే వాడు! "మసిద్దరిమధ్యా పాపాయి. ఇహ డబ్బు దుబారా చెయ్యకూడదు" అని ఎన్నిసార్లు అనుకునేవాడు. అప్పుడే తన పేర పదివేల రూపాయలకు ఇన్సూర్ చేశాడు.

అతని ప్రతిరూపం తన కడుపులో కదులుతూంది. అప్పుడప్పుడే అతన్ని తను ప్రేమించటం నేర్చుకుంటూంది.

క్యాంపు వెళ్ళిన అతను తిరిగిరాలేదు. అతని శవాన్ని చూడటానికి తాను వెళ్ళింది.

విధి ఎదురుదెబ్బతీసిందని మ్రాన్పడి పోయింది. తన బ్రతుకేమిటో తను ఊహించలేకపోయింది. ఆ ఉన్మాదావస్థ లోనే బాబుని ప్రసవించింది.

తల్లితండ్రులూ, తోబుట్టువులూ, తన బి. ఇ. డి. ట్రయినింగు గుర్తుచేశారు. తనకు ఉద్యోగంకోసం నాన్న- కాళ్ళు అరిగేటట్లు తిరిగారు.

తాను కొత్తజీవితం ప్రారంభించింది. పిల్లలు, స్కూలు, వారికి పాఠాలు చెప్పటం గతం మరవలేకపోయినా, విస్మ రించటానికి ప్రయత్నిస్తూంది.

బ్రతికి ఉండగా తన హృదయంలో స్థానం సంపాయించుకోలేక పోయిన నర సింహంగారు ప్రపంచంనుంచి తప్పుకొని తన హృదయాన్ని ఆక్రమించారు.

బాబు ప్రతి కదలికలో అతని రూపం దోబూచులాడుతుంది. అతనితో తను గడి పిన రోజులు గుర్తు వస్తాయి. పశ్చా త్తాపం, బాధ మనస్సు వికలమౌతుంది. ఇప్పుడాయన కనిపిస్తే పాదాలు పట్టుకొని తన నిలా శిక్షించారెందుకు? అని ప్రశ్నిం చాలని. తన తప్పుకి ఇంత ఘోరమైన శిక్ష విధించటం న్యాయం కాదనీ, ఏడవా లనిపిస్తూంది.


అవ్వాళ సముద్రపు ఒడ్డున చూడ టమే మరి కేశవ్‌ని తను చూడలేదు. తను పుట్టినింటికి మొదటిసారి వచ్చి నప్పుడే అమ్మ చెప్పింది. కేశవ్‌కి ఉద్యోగ మైంది, వాళ్ళీ ఊరునుంచి మకాం ఎత్తే శారని.

మళ్ళీ ఇవ్వాళ చూసింది కేశవ్‌ని.

"దిగండి మేడమ్" సన్నని గొంతు. ఆమె గతాన్ని చెరిపేసింది.

అరసవెల్లి ఆలయంముందు ఆగి ఉంది బస్సు. వాస్తవంలోకి వచ్చింది అరుంధతి.

*   *   *




వెయిటింగ్ రూంలో ఎవరో తనకోసం వచ్చి కూర్చున్నారని, ప్యూన్ చెప్పగానే గబ గబా అటువైపు నడిచింది అరుంధతి.

"సారీ—వర్కింగ్ అవర్సులో వచ్చి నిన్ను డిస్టర్బ్ చేసి ఉంటాను...." కేశవ్ గొంతు.

లోపలికి వస్తూనే ఉలిక్కిపడింది అరుంధతి

"ఓ. నువ్వా! లేదులే" అని నవ్వి, "కూర్చో కూర్చో ఏమిటిలా వచ్చావ్?" అతి మామూలుగా, ఎటువంటి తొట్రుపాటూ. వ్యక్తం కాకుండా అంటూ ఓ కుర్చీలో కూర్చుంది అరుంధతి.

"ఏంలేదు. అవ్వాళ కూర్మంలో నేను వచ్చేదాకా నిలవకుండా వెళ్ళిపోయావు. నీ వెంట వచ్చి మాట్లాడాలనుకున్నాను. కాని అంతమందిలో బాగోదు. ఎప్పుడో మాట్లాడవచ్చు అడ్రసుందికదాని వెళ్ళిపోయాను. నేను శ్రీకాకుళంలో జాబ్ చేస్తున్నాను. రెండు నిమిషాలు నాతో మాట్లాడటానికి వీలుంటుందా?" గబ గబా అన్నాడు కేశవ్.

"ఉండు. క్లాసు సోషల్ టీచరుకి వప్పగించి వస్తాను" అని బయటకు వెళ్ళి మళ్ళీ ఐదు నిమిషాల్లో తిరిగివచ్చి కూర్చుంటూ, "ఆ చెప్పు ఏమిటి మాటలు? నీ భార్యా పిల్లలు అంతా క్షేమమేనా?" అడిగింది అరుంధతి నవ్వుతూ.

ఆమె కనుల్లోకి లోతుగా చూసి, అదోలా నవ్వి "భార్యా. పిల్లలూ. ఆ అదృష్టం నేను విశాఖ బీచిలో పారేసుకున్నాను. అరూ! సారీ.... అరుంధతీ! ఇప్పుడు మీవారెక్కడ?" అడిగాడు కేశవ్.

తల వంచిన అరుంధతి కనుల్లో నీలి నీడలు తారట్లాడాయి. వెంటనే నీటితో నిండాయి.

ఆమె ఫాలాన్న ఉన్న తిలకంవైపు అనుమానంగా చూశాడు కేశవ్.

రెండు నిమిషాలు నిశ్శబ్దం తర్వాత, కనులు వత్తుకుని ఒకసారి కేశవ్ ముఖంలోకి చూసి తన గురించి క్లుప్తంగా చెప్పి, "నువ్వు ఎందుకు పెళ్ళి మానుకున్నావు?" అడిగింది అరుంధతి.

"అమాయకురాలైన ఒక ఆడపిల్ల మెడలో తాళికట్టి ఆమెను అన్యాయం చెయ్యటం ఇష్టం కాక...." అన్నాడు కేశవ్.

"అన్యాయమా? ఎందుకు చేస్తావ్?" అన్న అరుంధతి ప్రశ్నకు—

"మనస్సు చొక్కాలాటిది కాదు, అరుంధతీ...." అన్నాడు నవ్వుతూ.

"కేశవ్!...." అంది అరుంధతి కంపన స్వరంతో. ఆ నవ్వు ఆమె గుండెల్ని పిండింది.

"అవును. ఎప్పుడో నా మనస్సు ఒక స్త్రీ పాదాలముందు పారేసుకున్నాను. అది మరొక స్త్రీకి ఇవ్వటానికి తిరిగి రానంటూంది."

మౌనంగా తల వంచి ఉండిపోయింది అరుంధతి. ఆమె మనస్సు గందరగోళంగా ఉంది. ఐతే ఏమిటంటా డిప్పుడు! 'అస్సలు ఎందుకు వచ్చాడు.' ఆమెకు యిబ్బందిగావుంది. అతను తొందరగా వెళ్ళిపోతే బాగుండును అనిపిస్తూంది.

"ఇప్పుడైనా నాకు అభ్యంతరంలేదు అరూ, నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను స్వీకరించగలను" అని ఆమెతో ఎలా చెప్పాలి? కేశవ్ గుండె ఎందుకో వేగంగా కొట్టుకుంటూంది. గుండె చీల్చుకు వచ్చే మాట పెదవుల దగ్గర ఆగిపోతూంది.

క్షణాలు దొర్లాయి బరువుగా.

"అరూ!"

తలెత్తి చూసింది అరుంధతి ఎదురుగా.

"నిన్నూ నీ బాబునీ పువ్వులో పెట్టి చూసుకుంటాను. నన్ను.... నన్ను.... అంగీకరించగలవా? పెళ్ళికి అంగీకరించగలవా?" గబగబా తడబాటుగా అడిగేసి అరుంధతి ముఖంలోకి చూశాడు కేశవ్.

చివాలున లేచి నిల్చుని, గలగలా నవ్వేసి "ప్లీజ్ ఎక్స్‌క్యూజ్‌మీ కేశవ్.... మనస్సు చొక్కాలాటిది కాదు నిజమే. అంతేకాదు, అద్దంలాంటిదని కూడా వినేవుంటావు. ఏదో సంకోచంతో పగిలింది. పగిలిన అద్దంలో రెండు ముఖాలు చోటు చేసుకున్నాయ్. అవి నా బతుకిని ఛిద్రా-ఛిద్రం చేశాయి. ఇప్పుడు నాకు చలించే మనస్సు, ప్రేమించే హృదయం రెండూ లేవు. ఇప్పుడు, నేను ఈ లోకంలోకి తెచ్చిన 'బాబు' కోసం జీవించి శ్రమించే యంత్రాన్ని అంతే, వెళ్ళిపో. కేశవ్, గతం మరచి జీవితం సుఖంగా మలచుకో" అని వచ్చిన అతిధిని వదిలి చరచరా, తన క్లాస్‌రూమ్‌వైపు నడిచింది అరుంధతి. □